# చూపులేని పైలట్



ఆకాశంలో విమానాన్ని నడుపుతున్న పైలట్‌కి హఠాత్తుగా కళ్ళు కనిపించకపోతే? అలాంటి అనుభవమే ఎదురైంది అరవై అయిదేళ్ళ జిమ్ ఒనీల్‌కు. ఇతను ఐదువేల అడుగుల ఎత్తులో ఒక చిన్న విమానాన్ని ఒంటరిగా నడుపుతున్నాడు. హఠాత్తుగా గుండె పోటు రావడం మొదలైంది. పోటు ఆగిపోయినా, కాసేపటి వరకూ కళ్ళు కనిపించడం మానేసాయి. "ఇది చాలా భయానకానుభవం. హఠాత్తుగా నా ముందున్న డయల్స్ కనిపించడం మానేశాయి," అంటూ తన అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు జిమ్. మొదట సూర్యుడు కళ్ళల్లోకి కొట్టడం వల్ల ఇలా మసకబారాయి అనుకున్నాడు. కాని తర్వాత అర్థమైంది తనకు స్ట్రోక్ వచ్చిందని. సుమారు నలభై నిముషాలపాటు అతనికి ఇలా కళ్ళు కనిపించడం మానేశాయి. అదృష్టవశాత్తూ అదే సమయంలో అతనికి కొంత దూరంలో పాల్ గెరార్డ్ అనే మరో పైలట్ ఒక శిక్షణా విమానం నడుపుతున్నాడు. "జిమ్ ఏమంటున్నాడో నా కర్థం కాలేదు మొదట. పైలట్‌కు కళ్ళు కనిపించని ఇలాంటి పరిస్థితిలో ఒక విమానాన్ని లాండ్ చేయడం దాదాపు అసాధ్యం. అయినా నా ప్రయత్నం నేను చేయాలనుకున్నాను. అతనికి కొంత దూరంలో విమానాన్ని నడుపుతూ 'కుడికి మళ్ళించమని, ఎడమకు మళ్ళించమని, క్రిందకు దింపమని' ఇలా చెప్తూ పోయాను," అంటూ తన సహాయాన్ని వివరించాడు పాల్ గెరార్డ్. చివరకు రన్‌వే మీద రెండు మూడు గెంతులేసి కుదుపులతో లాండ్ అయిది జిమ్ విమానం. ఈ అనుభవాన్ని విన్న రాడార్ స్టేషన్ ఛీఫ్ మాట్లాడుతూ, "ఇలాంటి అనుభవం హాలీవుడ్ యాక్షన్ సినిమాల్లో మాత్రమే చూస్తాం. వాళ్ళిద్దరూ చేసింది అద్భుతం," అంటూ అబ్బురపడ్డాడు.

## అంతలోనే దివాలా



అతి లోభత్వం చివరకు ఏమీ మిగలకుండా చేస్తుందన్న నిజం తన పట్ల ఇలా ఋజువైనందుకు చాలా బాధ పడుతోంది అమండా రీస్. క్లీవ్‌లాండ్‌కు చెందిన ఈ యువతి ఆ మధ్య ఓ పాత ఇంట్లో అద్దెకు దిగింది. ఎనభై మూడేళ్ళు పైబడిన ఆ ఇంటికి కొన్ని మార్పులూ చేర్పులూ చేయాలనుకుంది. ప్రస్తుతం మేస్త్రీగా పనిచేస్తున్న తన హైస్కూలు క్లాస్‌మేట్ బాబ్ కిట్స్‌కు ఆ పని అప్పగించింది. బాబ్ కిట్స్ తన పనిలో భాగంగా బాత్రూం గోడలు బద్దలు గొడుతూంటే అతనికి రెండు పచ్చ రంగు పెట్టెలు కనిపించాయి. బద్దలు గొట్టి చూస్తే అందులో మొత్తం లక్షా ఎనభై రెండు వేల డాలర్ల డబ్బు కనిపించింది. దాన్ని ఇద్దరూ సామరస్యంగా పంచుకుంటే బానే ఉండేది. కాని బాబ్ అందులో నలభై శాతం అడిగితే అమండా ఇల్లు తనది కాబట్టి పది శాతమే ఇస్తానంది. దాంతో బాబ్ ఈ విషయాన్ని బయటకు పొక్కేలా చేశాడు. ఆ యింటి అసలు వారసులు రంగంలో దిగి కోర్టులో కేసు వేశారు. 1920ల్లో అమెరికా ఆర్థిక సంక్షోభంలో ఉన్న కాలంలో పాట్రిక్ డున్ అనే వ్యక్తి ఈ డబ్బు భవిష్యత్ అవసరాల కోసం దాచుకున్నాడు. అమండా రీస్, బాబ్‌ల పుణ్యమా అని ఇప్పుడిది బయటపడటంతో అతని వారసులు ఏకంగా 21 మంది ఈ డబ్బుకోసం దావా వేశారు. అయితే అప్పటికే అమండా తన హవాయి దీవుల పర్యటనలో ఆ డబ్బును విచ్చలవిడిగా ఖర్చుపెట్టేసింది. ప్రస్తుతం దాన్ని తిరిగి చెల్లించలేక కోర్టులో దివాలా తీసినట్టు ప్రకటించింది.

## 'సరసి' కత

# మేక శాకము

వైశంపాయనుడామధ్య సుబ్బాయమ్మ గారితో కలిసి పాతబస్తీలో ఓ పెళ్లి విందుకు వెళ్లాడు.

అక్కడ ఎక్కడ చూసినా 'నాన్ వెజిటేరియన్' వంటకాలే వడ్డిస్తున్నారు. మేము శాకాహారులం. 'వెజిటేరియన్స్ హై' అన్నాడు వైశంపాయనుడు వడ్డిస్తున్నవాడిని పిలిచి. 'ఒకే హై' అంటూ అతగాడు లోపలికెళ్లి రెండు ప్లేట్లలో ఏవో ఐటెమ్సు తెచ్చి, వాళ్ల ముందు పెట్టాడు.

అవి వేరేవిగా కనిపిస్తూ వుండటంతో సుబ్బాయమ్మగారు వెనక్కి జరిగింది




భయపడుతూ.

"ఇవి క్యా హై" అడిగాడు వైశంపాయనుడు.

"మటన్! మేకమాంసం హై!!" అంటూ సవినయంగా చెప్పి వెళ్లిపోతున్న ఆ ఆసామీని చొక్కా పట్టుకుని ఆపేడు. "మేము వెజిటేరియన్సుమని చెప్పాను. శాకాహారం వడ్డించాలిగా. మేకని తెచ్చేవేంటి?" నిలదీశాడు వైశంపాయనుడు.

"అవునండీ. మేక స్వచ్ఛమైన శాకాహారి! అది తినేది ఆకులూ అలములూ కదా!!" అన్నాడతడు స్వచ్ఛమైన తెలుగులో.

*